క్లుప్తంగా

చర్మకారుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి: చర్మకారుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర చర్మకార సేవా సంఘం అధ్యక్షుడు బుల్లా రాజారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్రంలో 16 జిల్లాలు తిరిగి చర్మకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో చర్మకారుల, డప్పు కళాకారులు, చర్మశుద్ధికారులు, కబేలా వృత్తిదారులకు జిల్లా ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం మంజూరు చేయాలని, లిడ్ క్యాప్‌కు రూ.300 కోట్లు కేటాయించి 300 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జిల్లాకు ఒకటి చొప్పున లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో చెప్పుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరపాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మస్తాన్ పాల్గొన్నారు.

వివాదాస్పద కొండ ప్రాంతం పరిశీలన



బడేపురం(తాడికొండ): తాడికొండ శివారు బడేపురం గ్రామంలో ఇరు వర్గాల మధ్య వివాదాస్పదంగా మారిన కొండ ప్రాంతాన్ని బుధవారం తాడికొండ తహసీల్దార్ కె.నాసరయ్య, సీఐ కె.వాసులు పరిశీలించారు. ఇక్కడ ఎస్సీలు, హిందువులకు సంబంధించిన ఆలయాలకు వెళ్లే మార్గానికి సంబంధించి వివాదం నడుస్తున్న నేపథ్యంలో దీనిపై ఓ అవగాహన కల్పించుకునేందుకు గాను సాధారణంగా పర్యటించి వివరాలు తెలుసుకున్నట్లు వారు వెల్లడించారు. వారి వెంట రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నేడు ఏసీఏ అపెక్స్ బాడీ సమావేశం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు ఏసీఏ క్రికెట్ ఇంటర్‌నేషనల్ స్టేడియంలో ఏసీఏ క్రికెట్ అపెక్స్ బాడీ సమావేశం జరుగుతుందని నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు విజయవాడ ఎంపీ ఆంధ్రా క్రికెట్ అసోషియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని) అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



తాడికొండ: తుళ్ళూరు మండలం వెంకటపాలెం గ్రామంలో అక్రమ మద్యం అమ్మకాలపై తుళ్ళూరు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో గ్రామానికి చెందిన గొడ్డపాటి రమేష్ (52)ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 86 క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

పెదకాకాని శివాలయ వైదిక ఆగమ కమిటీ ఏర్పాటు



పెదకాకాని: శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వైదిక ఆగమ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. శివాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీఓఎంఎస్ నంబరు 223 రెవెన్యూ(దేవదాయశాఖ-1) డిపార్టుమెంట్, కమిషనరు దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి హాలులో అర్చకులు, వేదపండితులతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశం ద్వారా అర్చకులు, వేదపండితుల అందరి ఆమోదంతో వైదిక ఆగమ కమిటీ ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. వైదిక ఆగమ కమిటీ అధ్యక్షుడిగా ఆలయ స్థానాచార్యుడు పొత్తూరి సాంబశివరావు, కమిటీ సభ్యులుగా ఆలయ ఉప ప్రధాన అర్చకులు చదలవాడ జాలయ్య, పేటేటి ధనమహేశ్వరప్రసాద్, ముఖ్య అర్చక చదలవాడ శివశంకరశాస్త్రి, వేదపండితుడు వ్యాకరణం గణపతిశర్మలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఆలయంలో పూజ విధానాలకు, ముఖ్యమైన మతపరమైన విషయాలపై నిర్ణయాలు తీసుకోవడంలో, ఆలయ ఆచారాలు, సేవలను నిర్వర్తించే విధానం, స్థిరీకరణ యాగాలు, కుంభాభిషేకాలు, ఇతర వైదిక కార్యక్రమాల నిర్వహణకు ముహుర్తాలు, పండుగలు, నూతన సేవలు ప్రవేశపెట్టడానికి ప్రతిపాదించడం కోసం వైదిక ఆగమ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని ఆలయ ఉప కమిషనరు శ్రీనివాసరావు వివరించారు.

మీ పవర్.. మీ చేతిలో..!

రీచార్జి చేసుకో... పవర్ వాడుకో

- సెల్‌ఫోన్ తరహాలో పవర్ రీచార్జ్ మీటర్ల ఏర్పాటు
- మంగళగిరిలో కొనసాగుతున్న స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ
- ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో బిగింపు పూర్తి
- వాణిజ్య, వ్యాపార సంస్థలకు కొనసాగుతున్న ఏర్పాటు
- ఎంటీఎంసీ పరిధిలో 9,500 స్మార్ట్ మీటర్లు అవసరం

మంగళగిరి: ఇప్పటి వరకు విద్యుత్ బిల్లులను వివిధ యాప్‌లు, విద్యుత్ శాఖ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాలు ఇలా ఎవరికి వీలైన విధానంలో వారు చెల్లించేవారు. కానీ ఇప్పుడు ఎప్పటిలా విద్యుత్ బిల్లులు రావు. ఎవరికి కావలసిన విద్యుత్‌ను వారు ముందుగానే కొనుక్కోవలసి ఉంటుంది.

బిల్లుల స్థానంలో ప్రీ పెయిడ్ విధానం

విద్యుత్ చార్జీల చెల్లింపు విధానం ప్రీ పెయిడ్‌లోకి మారనుంది. ఇక నుంచి ముందస్తుగా రీచార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుంది. రీచార్జ్ మొత్తం అయిపోగానే ఆటోమేటిక్‌గా సరఫరా నిలిచిపోతుంది. సెల్‌ఫోన్ రీచార్జి తరహాలో విద్యుత్ బిల్లులను రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. ఆ దిశగా ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుంది.

బకాయిలు పేరుకుపోకుండా...

పాత విధానంలో బకాయిలు పేరుకుపోతున్నాయని భావించిన విద్యుత్ సంస్థలు నూతనంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుని



స్మార్ట్ మీటరు

శ్రీకారం చుట్టాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యుత్ సంస్థలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేశాయి.

- స్మార్ట్ విధానంలో వినియోగదారులు ముందుగా విద్యుత్ వినియోగం మేరకు రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాలెన్స్ ఉన్నంత వరకు నిర్విరామంగా విద్యుత్ సరఫరా అవుతుంది. బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.
- ఈ విధానంలో ఎంత విద్యుత్‌ను వినియోగించామో, ఇంకా ఎంత బ్యాలెన్స్ ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా యాప్‌ను తీసుకురానున్నారు. ఈ యాప్‌ను వినియోగదారులు తమ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని పరిశీలించుకోవచ్చు. బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే మరలా నగదు చెల్లించి రీచార్జి చేసుకుంటే విద్యుత్ సరఫరా కొనసాగుతుంది.

ప్రారంభమైన స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ

ఇప్పటికే నగరంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. తొలివిడతగా ప్రభుత్వ కార్యాలయాలలో 276 మీటర్ల ఏర్పాటు పూర్తి చేశారు.

- రెండవ విడతగా వాణిజ్య, వ్యాపార సంస్థలలో బిగింపు ప్రక్రియ ప్రారంభించారు. మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య, వ్యాపార సముదాయాలు, గృహ అవసరాలకు మొత్తం 9,500 స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.
- ఇప్పటివరకు విద్యుత్ వినియోగించిన అనంతరం విద్యుత్ శాఖ సిబ్బంది ఇంటింటికి బిల్లు ఇచ్చిన అనంతరం వినియోగదారులు ఆయా ప్రాంతాలలోని విద్యుత్ బిల్లు వసూలు కార్యాలయాలలో బిల్లులు చెల్లిస్తున్నారు.
- ప్రతి నెలా బిల్లు వచ్చిన అనంతరం వినియోగదారులకు చెల్లించేందుకు 15 రోజులు గడువు ఉంటుంది. అనంతరం జరిమానాలతో చెల్లిస్తున్నారు. వరుసగా రెండు నెలలు చెల్లించకపోతే మీటరుకు ఉన్న ఫీజులను సిబ్బంది తొలగించి మరలా బిల్లు చెల్లిస్తే తిరిగి విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు.



స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న సిబ్బంది

ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు



విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాం. ప్రభుత్వ కార్యాలయాలలో 276 మీటర్లు ఏర్పాటు పూర్తి చేశారు. గత రెండు రోజులుగా వాణిజ్య, వ్యాపార సముదాయాలలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుంది. అనంతరం గృహాలకు ఏర్పాటు చేస్తాం. నగర పరిధిలో మొత్తం 9,500 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– జి.సురేష్‌బాబు, డీఈఈ, మంగళగిరి

సైబర్ క్రైమ్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పొన్నెకల్లు(తాడికొండ): సైబర్ క్రైమ్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా అడ్డుకట్ట వేయవచ్చని తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. తాడికొండ మండలం పొన్నెకల్లు బొడ్డురాయి సెంటర్‌లో సైబర్ క్రైమ్ నేరాలపై నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల కాలంలో సైబర్ క్రైమ్ నేరాలు పెరిగాయని, గ్రామీణ ప్రాంతాలలో వీటిపై పెద్దగా అవగాహన లేని కారణంగా ప్రజలు మోసాలకు గురై ఆన్‌లైన్‌లో నగదును పోగొట్టుకొని బాధితులవుతున్నారన్నారు. ప్రధానంగా ఏటీఎం పిన్, ఓటీపీ నంబర్‌లను ఎవరైనా ఫోన్‌చేసి అడిగితే అసలు చెప్పకూడదన్నారు. ఏటీఎంల వద్ద తెలిసిన వారి సహాయం తప్ప గుర్తు తెలియని వ్యక్తుల సహాయం కోరడం వంటివి మోసాలకు దారితీస్తాయన్నారు. అపరిచిత వ్యక్తులు బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి కొన్ని వివరాలు కావాలని అడుగుతారని, వారికి ఓటీపీలు, పిన్ నంబర్లు చెప్పడం ద్వారా క్షణాల్లో ఖాతాల్లో నగదు మాయమవుతుందన్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ఊళ్లకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించి భద్రతను పెంచుకోవడం వంటి అంశాలపై ఆయన వీడియోలను ప్రదర్శించడంతో గ్రామస్తులు ఆశక్తిగా చూసి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రధాన వీధికే పారిశుద్ధ్యం

- తుప్పుపట్టి మరమ్మతులకు గురైన రిక్షాలు
- వార్డుల్లోని కొన్ని ప్రాంతాలకు రాని ట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఫిరంగిపురం: పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అనే నినాదం నీటి మూటగానే మండల కేంద్రంలో మారింది. ఫిరంగిపురంలో సుమారు 20 వేల జనాభా నివసిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు పంచాయతీ వారు 22 మంది పారిశుద్ధ్య కార్మికులు, ఐదుగురు హరిత రాయబారులను నియమించారు. వారితో పాటు తాగునీటి సరఫరా కోసం మరో ఏడుగురు, ఒక వాచ్‌మెన్‌ను కాంట్రాక్ట్ బేసిస్‌లో తీసుకున్నారు.

మూడు ట్రాక్టర్లు... 18 రిక్షాలు

గ్రామంలో పారిశుద్ధ్యం పనులకు వీలుగా మూడు ట్రాక్టర్లు, 18 రిక్షాలు ఏర్పాటు చేశారు. కాగా మూడు ట్రాక్టర్లలో సిబ్బంది వెళ్లి చెత్తచెదారాన్ని ఎత్తి డంపింగ్‌కు తరలించాల్సి ఉంది.

మూలన పడిన రిక్షాలు

గడిచిన కొద్ది రోజులుగా రిక్షాలు మరమ్మతులకు



మరమ్మతులకు గురైన రిక్షాలు



ప్రధాన వీధిలో ఉన్న పారిశుద్ధ్యం తోలే ట్రాక్టర్

గురయ్యాయి. కానీ ఇంత వరకు వాటిని మరమ్మతులు చేయించలేదు. దీంతో కొన్ని ప్రాంతాలకు రిక్షాలు తీసుకువెళ్లలేని పరిస్థితి.

కార్మికులకు జీతాలు లేవు

గడిచిన కొద్ది నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు అందక పోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇల్లు గడవని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి జీవించాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రతి ఏటా పన్నుల రూపేణా గృహ యజమానులు చెల్లిస్తున్నా సౌకర్యాల కల్పనలో పంచాయతీ అలసత్వంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి రిక్షాలకు మరమ్మతులు చేయించి ట్రాక్టర్లు పోలేని ప్రాంతాలకు చెత్త సేకరణకు రిక్షాలు వినియోగించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కంపు కొడుతున్న రోడ్లు

గ్రామంలోని బీఎస్ఎన్ఎల్ ఎదురు బజార్, జెండా చెట్టు ప్రాంతంలోని కొన్ని బజార్లు, రైసు మిల్లు బజారు, రసూల్ పేటలోని కొన్ని ప్రాంతాలు, కొత్తపేటలోని కొన్ని అడ్డదారులలో ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు చెత్తను పారవేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- కొందరు తమ ఇళ్లలోని చెత్తను సమీపంలోని రోడ్లపైనే పోస్తున్నారు. మరికొందరు వాహనాలపై వెళ్లి ఊరి చివరన పోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కొన్ని చోట్ల రోజు దానిని సిబ్బంది తీసి వేస్తున్నా ప్రజలు ఆ ప్రాంతంలోనే మరలా వేస్తుండటంతో ఆ దారిన నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది.



చర్చిపక్కన గొందిలో వేస్తున్న చెత్త

త్వరలో జీతాలు చెల్లిస్తాం

నేను కొద్దిరోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించాను. రిక్షాలకు మరమ్మతులు చేయించి వాటిని వినియోగంలోకి తీసుకువస్తాను. త్వరలో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించేలా చూస్తాను. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాను.

– ఏకే బాబు, పంచాయతీ ఏవో

మార్చిలోగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ పీడీ ప్రసాద్

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల, చిలువూరు గ్రామాల పరిధిలోని లే అవుట్లను గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జేవీఎస్ ఆర్‌కేవీ ప్రసాద్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మొదలైన గృహాలను మార్చి నెలాఖరు లోగా పూర్తి చేసుకోవాలని, లబ్ధిదారులకు ఎస్‌హెచ్‌జీ లోన్ అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మొదలైన గృహాలకు యూనిట్ ధర పెరిగే అవకాశం ఎంత మాత్రం లేదని, మార్చి నెలాఖరు లోగా గృహాల నిర్మాణం పూర్తి చేసుకోని ఎడల భవిష్యత్తులో వారికి ఎటువంటి సహాయ సహకారాలు అందవని కచ్చితంగా వివరించారు. రూఫ్ లెవల్‌లో ఆగిపోయిన గృహ నిర్మాణ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారికి ఎస్‌హెచ్‌జీ లోన్స్ తీసుకుని గృహ నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల సహాయక ఇంజనీర్ జీ.వి.సుబ్బారావు, ఎంపీడీవో జబీన్, హౌసింగ్ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ సెక్రటరీలు, ఏపీఎం, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు జున్నూసాహెబ్‌కు డాక్టరేట్

ఫిరంగిపురం: ఫిరంగిపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జున్నూసాహెబ్‌కు సోషల్ సర్వీస్ విభాగంలో డాక్టరేట్‌ను హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ హ్యూమన్ రైట్ ట్రస్ట్ బుధవారం అందజేసింది. జున్నూసాహెబ్ వృత్తిరీత్యా యడ్లపాడు మండలం సొలస ఎంపీపీఎస్(ఏఏ)పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుంటారు. కాగా ప్రవృత్తిరీత్యా గుండ్రటి చేతిరాతను 18 వేల మంది విద్యార్థులకు అనేక పాఠశాలలకు వెళ్లి నేర్పించాడు. అంతేకాక 700 మంది ఉపాధ్యాయులకు సైతం చేతిరాత (హ్యాండ్ రైటింగ్)ను నేర్పించాడు. కరోనా సమయంలో కూడా అనేక మందికి గుండ్రటి చేతరాతను నేర్పించాడు. హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ హ్యూమన్ రైట్ ట్రస్ట్ (జీహెచ్ఆర్టీ) వారు గుర్తించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఇంటర్‌నేషనల్ పీస్ కాన్ఫరెన్స్ సభలో దేశంలో వివిధ రంగాలకు చెందిన 50 మందికి డాక్టరేట్లు అందించారు. కాగా ముఖ్య అతిథిగా వచ్చిన శ్రీలంక మినిస్టర్ అహ్మద్‌సాధిక్ చేతులమీదుగా జున్నూసాహెబ్ డాక్టరేట్‌ను అందుకున్నారు. జున్నూసాహెబ్‌కు డాక్టరేట్ రావడంతో గ్రామంలోని పలువురు తోటి ఉపాధ్యాయులు,స్నేహితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించండి



మాట్లాడుతున్న సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలని సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో సీపీఎం రూరల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా ప్రజాపోరు పేరుతో సీపీఎం నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మద్యపానం నియంత్రిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి నేడు మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, రాష్ట్రంలో టీడీపీ పాలన ఉందో, బీజేపీ పాలన ఉందో ప్రజలకు అర్థం కావడం లేదని, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బీజేపీ రూట్ మ్యాప్ తీసుకుని ముందుకు వెళుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాజా వెంకటేశ్వరరావు, పల్లె కృష్ణ, ఎస్.కిషోర్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ నిల్వలు స్వాధీనం



తాడికొండ: తుళ్ళూరు మండలం వెంకటపాలెం గ్రామంలోని చెరువు వద్ద ఉన్న రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన సరుకు నిల్వలు ఎవరివి అనేవి తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి



మేడికొండూరు : బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మేడికొండూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో బుధవారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై మేడికొండూరు సీఐ నాగుల్ మీరా సాహెబ్ తెలిపిన వివరాల ప్రకారం చెరుకూరి రవికుమార్(45) గ్రామంలోని ఇందిరానగర్ కాలనీలో నివసిస్తుంటాడు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థులు బావి వద్దకు వెళ్లి చూడగా బావిలో రవికుమార్ మృతదేహం పైకి తేలియాడుతూ కనిపించింది. విద్యార్థులు ఉపాధ్యాయులకు విషయం తెలియపరచగా వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా రవికుమార్ అని నిర్ధారణకు వచ్చి బంధువులకు తెలియపరిచారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకొని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు సీఐ తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో రావెల విద్యార్థుల ప్రతిభ

రావెల(తాడికొండ): 68వ ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను గుంటూరు జిల్లాకు దక్కేలా చేశారని రావెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు జిల్లా దర్గామిట్టలో ఈ నెల 2, 3 తేదీలలో నిర్వహించిన అండర్-17 రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో గుంటూరు జిల్లా జట్టు నుంచి మొత్తం ఐదుగురు విద్యార్థినులు పాల్గొనగా తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు స్వర్ణ పతకాన్ని సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. వీరిలో పేరుబోయిన భార్గవి ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికవగా, బొంతా అనూష స్టాండ్‌బైగా నిలిచింది. ఎ.పూజిత, ఎం.అక్షయలు ఉత్తమ ప్రదర్శన చేసిన విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, శిక్షకుడు అన్నవరపు రాకేష్‌ను హెచ్ఎం నాగమణి, ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ రేష్మ, పీఈటీ జగదీశ్వర రెడ్డి, వంకాయలపాటి రవిబాబు, చెరుకూరి శ్రీనివాసరావు, శివకుమారి, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

చిప్స్‌లో ఔషధ మొక్కల ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఔషధ మొక్కల ప్రదర్శన నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ ప్రదర్శనలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర్ మాట్లాడుతూ మన దైనందిన జీవితంలో ఎన్నో ఔషద మొక్కలను ఇంట్లో కానీ లేదా మందుల తయారీలోగాని విరివిగా వాడటం నిత్యం మనం చూస్తూనే ఉన్నామన్నారు. కానీ వాటి ప్రయోజనాలు నేటికి ఎందరికో తెలియదని అటువంటి ఔషద మొక్కలను వాటి ప్రయోజనాలను ప్రతి ఒక్కరికి తెలియజేయటం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రదర్శనలో సిబార్ డెంటల్ కళాశాల, జేకేసీ కళాశాల విద్యార్థులు పాల్గొని ఔషధ మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.

కార్మికుల సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన



ధర్నా చేస్తున్న కార్మికులు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిలు వచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తారని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల యూనియన్ నాయకులు కూరపాటి స్టీఫెన్ స్పష్టం చేశారు. బుధవారం దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ నాయకులతో పాటు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయని, కార్మికులు తమ కష్టార్జితాన్ని తమకు ఇమ్మని మాత్రమే అడుగుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటే ఒక్క రోజులో సమస్య పరిష్కారం అవుతుందని, నియోజకవర్గ ఎమ్మెల్యే నారా లోకేష్ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఆర్ ఇస్రాయిల్, విజయం పిల్లే, ఎం.ఆశీర్వాదం, గురవయ్య, వై.సాంబయ్య, రమాదేవి, కె.జి.కృష్ణ, ఎం.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీలో అన్వేషణ- 2024

పెదకాకాని: సృజనాత్మక ఆవిష్కరణలు, విమర్శనాత్మక ఆలోచనలు ప్రోత్సహించడమే అన్వేషణ- 2024 ముఖ్య ఉద్దేశమని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. సాంకేతిక విద్యార్థులలో నూతన ఆవిష్కరణలను, ఆలోచనలను ప్రోత్సహించేందుకు గాను అఘస్త్యా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన అన్వేషణ- 2024 కార్యక్రమాన్ని బుధవారం వీవీఐటీ ఐఎస్, ఐయూసీఈఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ కార్యక్రమంలో భాగంగా 25 బృందాల విద్యార్థులు వారి ఆవిష్కరణల ఆలోచనలను, నమూనాలను ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలు హాజరైన ప్రొఫెసర్ కేఎస్‌వీఆర్ కుమార్, అన్వేషణ సంధానకర్త మల్లేష్ బట్టు విద్యార్థులు రూపొందించి ఆవిష్కరణల సమూనాలకు తగు సూచనలు అందించారు. ప్లాస్టిక్ అరికట్టడం, ఆటోమెటిక్ వాటర్ క్లీనింగ్ సిస్టమ్, సోలార్ కార్ ఆవిష్కరణల నమూనాలు అన్వేషణ గ్రాండ్ ఫినాలేకు ఎంపిక కాబడ్డాయని అన్వేషణ సంధానకర్త మల్లేష్ బుట్టు తెలిపారు.